క్లుప్తంగా

దోమల నివారణ చర్యలు చేపట్టాలి



కమ్మర్‌పల్లి: ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి దోమల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. మండలంలోని చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లతో సీజనల్ వ్యాధుల నివారణపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త 100 ఇళ్లను సందర్శించి దోమల వ్యాప్తికి కారణమైన నీటి నిల్వ గుంతలను పూడ్చేయించాలన్నారు. మలేరియా, డెంగీతో పాటు జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారి సుప్రియ, సిబ్బంది శ్రీసాయి, సత్యనారాయణ, పవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర స్వాములకు సన్మానం

నందిపేట్(ఆర్మూర్): నిజామాబాద్ నుంచి శబరిమలైకి పాదయాత్ర చేసిన అయ్యప్ప మాలధారులను మండలంలోని చౌడమ్మకొండూర్ గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. హరిహరపుత్ర అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు ధాత్రిక రతన్ గురుస్వామి కాశి నుంచి ఇందూరుకు, ఇందూరు నుంచి శబరిమలైకి 30 మంది స్వాములను తీసుకెళ్లి మహా పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా రతన్ గురుస్వామిని తన సొంత గ్రామమైన చౌడమ్మ కొండూరులో గురుస్వామి బండారి దేవదాస్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ ధాత్రిక రాజు, గుండు జీవన్, చైర్మన్ పోశెట్టి, గ్రామ భజన మండలి సభ్యులు, అయ్యప్ప భక్తులు ఘనంగా సన్మానించారు.

ఎయిడ్స్‌కు మందు లేదు



మాక్లూర్: ఎయిడ్స్‌కు మందులేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఏఆర్టీ కౌన్సిలర్ డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 1న నిర్వహించనున్న ఎయిడ్స్ డేను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీకళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఎం సరిత, ప్రిన్సిపల్ లావణ్య, వైస్ ప్రిన్సిపల్ టి వాసవిలత, మాధురి పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగిఉండాలి



నవీపేట: రాజ్యాంగం కల్పించిన హక్కులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు విద్యార్థులకు సూచించారు. మండలకేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో రాజ్యాంగ ప్రచార ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకికవాదం, సార్వభౌమాధికారాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత, కుల వివక్ష నేరమనే అంశాన్ని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు రాజశేఖర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల (రామ్ మందిర్)కు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మంగళవారం కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. పాఠశాలకు తమ వంతు సహాయసహకారాలు అందిస్తామన్నా రు. కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ సభ్యులు గోనే దామో దర్, రాస ఆనంద్, ఉపాధ్యాయులు కవిత, సాయిరాం పాల్గొన్నారు.

కేశ్‌పల్లిలో వైద్య శిబిరం

జక్రాన్‌పల్లి: మండలంలోని కేశ్‌పల్లిలో మంగళవారం పడకల్ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయుర్వేద వైద్యురాలు లలిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గాలివీస్తోంది

- విజయాన్ని ఏ శక్తీ ఆపలేదు
- రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి



స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు



సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని చక్కర కార్మాగారం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభకు ఇమ్రాన్‌ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించిందని, రూ.4వేల కోట్ల బడ్జెట్ పెట్టనుందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పిన కేసీఆర్.. ఆయన కుటుంబ సభ్యులకు పెద్దపెద్ద మహల్‌లు కట్టించి ఇచ్చారని, ఇక్కడ కూడా ఓ మహల్ కట్టుకున్నది తాను చూశానన్నారు. అభివృద్ధిపై ప్రశ్నించినవారిపై కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్‌తో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. బోధన్ చక్కెర ఫ్యాక్టరీని తెరవాలన్నా.. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు మైనారిటీలు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి, పార్టీ ఎన్నికల అబ్జర్వర్ షాయదా భేగం, తాహెర్ బిన్ హందాన్, పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఖలీం, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం మారాలి

రాష్ట్ర ప్రజలు ప్రభుత్వం మారాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని పెగడాపల్లి చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీలను విస్మరించారని, సంక్షేమ పథకాలకు కమీషన్లు తీసుకున్నారని విమర్శించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను విస్మరించారని, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తానని చెప్పి పేదలను మోసం చేశారని ఆరోపించారు. బీజేపీని ప్రజలు నమ్మడం లేదన్నారు. మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మ పురి సంజయ్, మాజీ సర్పంచులు వీరభద్రరావు, బంటు సాయిలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే పాట్లు తప్పవు





ఆర్మూర్ పట్టణంలో మాట్లాడుతున్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి.. ఎన్నికల ప్రచారానికి హాజరైన ప్రజలు

- ఆర్మూర్‌కే తలమానికం వంద పడకల ఆస్పత్రి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఆర్మూర్ : బీజేపీ, కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే రాష్ట్రానికి పాట్లు తప్పవని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని అరుంధతినగర్ కాలనీలతో పాటు పలువార్డుల్లో ప్రజాఆశీర్వాద యాత్రను నిర్వహించారు. ఆయా వార్డుల ప్రగతి నివేదికలను ప్రజల ముందుంచి మరోసారి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్లు రూ.5 వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.6 వేలకు, రైతుబంధు సాయం ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెరుగుతాయన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.3వేల భృతి వస్తుందన్నారు. రూ.400కే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామన్నారు. రూ.5 లక్షల చొప్పున ఇంటింటికి కేసీఆర్ బీమా అమలు కానుందని జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్మూరు పట్టణంలో ఎవరూ ఊహించని అభివృద్ధి జరిగిందని, పదేళ్ల క్రితం మురికికూపంలా కనిపించిన ఆర్మూర్ పట్టణం నేడు అభివృద్ధితో కళకళలాడుతున్నదన్నారు. అన్ని కులాలకు ఫంక్షన్ హాళ్లు నిర్మించామన్నారు. పెర్కిట్ చెరువు, రెడ్డి చెరువుల్లో కాలుష్యనివారణ పనులు, మోడ్రన్ ధోబీఘాట్, గూండ్లచెరువు టూరిజం అభివృద్ధి పనులు, వెజ్–నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు, కోట్లాది రూపాయల వ్యయంతో సిద్దులగుట్ట ఘాట్ రోడ్డు, అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణ, డివైడర్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. మీ కళ్ల ముందు పుట్టి పెరిగిన మీ బిడ్డను కాబట్టి.. మీ కడుపులో తలపెట్టి అడుగుతున్నానని, తనను మళ్లీ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

అవినీతి పాలనను అంతం చేయాలి



ర్యాలీలో పాల్గొన్న మధ్యప్రదేశ్ మంత్రి రాజేందర్ శుక్ల త్రిపాఠి, బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో అవినీతిపాలనను అంతం చేసి బీజేపీకి పట్టం కట్టాలని, పైడి రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మధ్యప్రదేశ్ మంత్రి రాజేందర్‌శుక్ల త్రిపాఠి అన్నారు. పైడి రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మామిడిపల్లి చౌరస్తా నుంచి గోల్‌బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిపాఠి మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్నాయన్నారు. అనంతరం రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్మూర్ ప్రజలు తనను ఆశీర్వదించాలని, గెలిచిన సంవత్సరం లోగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించకుంటే రాజీనామా చేస్తానన్నారు. నిజాయితీ పాలన అందిస్తానని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం తన సొంత గ్రామమైన అంకాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్, జీవీ నర్సింహారెడ్డి, యమాద్రి భాస్కర్, కలిగోట గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో అసైన్డ్ భూములకు అక్రమంగా ఇంటినంబర్లు కేటాయించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ నర్సింహారెడ్డి ఆర్డీవో కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అక్రమంగా కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బీజేపీ, బీజేవైఎం నాయకు లు ఉన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించండి

- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్



పచ్చలనడ్కుడలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

వేల్పూర్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ కోరారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో సునీల్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చదువుకునే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఫీజులు చెల్లించాల్సి వస్తోందన్నారు. ధరణి పేరుతో రైతులను దగా చేశారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. కొత్త రేషన్‌కార్డుల ఊసేలేదని, పాత కార్డుల్లో పేర్ల చేరిక లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదవాడికి ఖరీదైన వైద్యం అందని ద్రాక్షగా మారిందని, తెలంగాణ తెచ్చుకున్నది ఇందుకేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. పంట పెట్టుబడి సాయాన్ని ఎకరానికి ఏడాదికి రూ. 15 వేలు అందిస్తుందని, రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు అందిస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు రూ.2500 జమచేస్తుందని, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించి, నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

- విలేకరుల సమావేశంలో కర్ణాటక రాష్ట్ర రైతులు



బోధన్‌లో మాట్లాడుతున్న కర్ణాటక రాష్ట్ర రైతులు

బోధన్ టౌన్ (బోధన్): తెలంగాణ ప్రజలు తమ రాష్ట్ర ప్రజల్లా కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దని కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైతులు అన్నారు. పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని ఆరోపించారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తామని.. కేవలం 4 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సుప్రయాణంలో అనేక నిబంధనలను పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి అమలు లేదన్నారు.

మైనారిటీలు ఆలోచించాలి

పట్టణంలోని నాదెల్లి ప్రార్థన మందిరానికి చెందిన 5.35 గుంటల వ్యవసాయ భూమిని కబ్జా చేసిన కౌన్సిలర్ శరత్‌రెడ్డి, పెద్దిరెడ్డిల పక్షాన నిలవడానికి మైనారిటీలు ఆలోచన చేయాలని ప్రార్థన మందిరం కమిటీ కార్యదర్శి మహమ్మద్ ఆసిఫ్ జానీ అన్నారు. వక్ఫ్‌బోర్డు భూమిని కబ్జా చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అటువంటి వారి పక్షాన మైనారిటీలు నిలబడడం ఎందుకన్నారు. సమావేశంలో అంజద్ తదితరులున్నారు.

లిల్లిపుట్‌లో మాక్ పోలింగ్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో చిన్నారులు పాఠశాల హెడ్ బాయ్, హెడ్‌గర్ల్‌ను ఓటు ద్వారా ఎన్నుకున్నారు. హెడ్ బాయ్‌గా హనీష్, హెడ్ గర్ల్‌గా శివ మాధురి ఎన్నికయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ చిన్నారులకు ఎన్నికల ప్రక్రియతో పాటు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దాసు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

వర్ని (మోస్రా): మండలంలోని గోవూరు గ్రామంలో సుమారు 20 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం బీఆర్‌ఎస్ లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఉమ్మడి మండల పార్టీ ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పారు. సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు అశోక్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

వరికి రూ.3,100 మద్దతు ధర కల్పిస్తాం

- బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ



బషీరాబాద్‌లో మహిళలతో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ

కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే క్వింటాలు వరికి రూ.3100 మద్దతు ధర కల్పిస్తామని బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో అన్నపూర్ణమ్మ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడబిడ్డ పుట్టగానే వారి పేరుమీద రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామన్నారు. డిగ్రీ చదువుకునే విద్యార్థినులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు ఇస్తామన్నారు. ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడమే బీజేపీ ధ్యేయమన్నారు. ఉజ్వలయోజన లబ్ధిదారులకు సంవత్సరానికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాము గెలిస్తే పార్టీ మారబోమని గ్యారంటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతిరహిత పాలన బీజేపీకే సాధ్యమని, సుపరిపాలనే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్, నాయకులు గోవర్ధన్, మురళి, పోతునూరి గణేశ్, సక్కారం నర్సారెడ్డి, రాజ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

బాల్కొండ: తమ ప్రభుత్వంపై తెలంగాణ మంత్రి, బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మండిపడ్డారు. బాల్కొండ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి స్థాయిలో ఉండి దిగజారుడు మాటాలు మాట్లాడడం అన్యాయమన్నారు. దమ్ముంటే తనతో కర్ణాటక రావాలని ప్రశాంత్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సవాల్ చేసినా రాలేదన్నారు. బురద జల్లే రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికీ ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తానని.. తనతో కర్ణాటకకు వచ్చి పథకాల అమలను పరిశీలించాలన్నారు. ప్రజలు ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జక్క రాజేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం



సాక్షి నెట్‌వర్క్ : అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వర్నిలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత ప్రచారం నిర్వహించారు. రెంజల్ మండలం తాడ్‌బిలోలిలో సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోబీన్‌ఖాన్ ప్రచారం చేయగా, బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి మద్దతుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా కల్యాణోత్సవం



రుద్రూర్: మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో రుక్మిణీపాండురంగ కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులకు అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కాకడ హారతి ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు రామశర్మ, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిదుర వీరేశం, గెంటీల సాయిలు, కార్యవర్గ సభ్యులు కర్క అశోక్, మోత్కురి లాలేందర్, నారాయణ, విజయ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



నివాళులు అర్పిస్తున్న మజ్దూర్ సంఘ్ నాయకులు

ఎడపల్లి(బోధన్) : ఏఈఆర్పీ క్యాంపులో 1955లో చోటుచేసుకున్న పోలీసుల కాల్పుల్లో అమరులైన నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులు రాజయ్య, రాములు, రామయ్యకు మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. మజ్దూర్ సభ జనరల్ సెక్రటరీ ఉపేందర్, స్వర్గీయ తోట రాజయ్య మనవడు తోట రాజశేఖర్, మజ్దూర్ సభ నాయకులు జ్యోతిరాజ్, రాజేశ్వర్, బలరాం, శ్రీనివాస్‌గౌడ్, భూమయ్య, రాజు, ఖాజామొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మంగళవారం (తెలుగు)- 12.25, 7.00
టైగర్-3 (తెలుగు)-3.35, 10.10

స్క్రీన్-2 – ఆదికేశవ (తెలుగు)- 11.00, 1.50, 4.40, 7.30, 10.20

స్క్రీన్-3 – కోటా బొమ్మాళి పీఎస్ (తెలుగు)- 10.00, 1.00, 7.10, 10.10
మంగళవారం (తెలుగు)- 4.00

స్క్రీన్-4 – టైగర్-3 (హిందీ)- 10.15,
మాధవే మధుసూదనా (తెలుగు) 4.00
సౌండ్‌పార్టీ(తెలుగు)7.00
పర్‌ఫ్యూమ్ (తెలుగు) 9.45

చివరి క్షణం వరకు విస్తృత ప్రచారం

- ముగిసిన సాధారణ ఎన్నికల ప్రచారం
- హోరెత్తించిన రాజకీయ పక్షాలు



రహత్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



వర్నిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు



బోధన్ పట్టణంలో బీజేపీ శ్రేణుల ద్విచక్ర వాహన ర్యాలీ

మోర్తాడ్(బాల్కొండ): సాధారణ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. చివరి క్షణం వరకు ఓట్ల వేట సాగించిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేశారు. భారీ బహిరంగ సభలు, కార్నర్ మీటింగులతో అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల అగ్రనేతలు హోరెత్తించగా, అభ్యర్థులు గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. జిల్లాలో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గంలోని మండలాలు ఉన్నాయి. ఆరు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తుండగా బీఎస్పీ, డీఎస్పీ ఇతర స్వతంత్ర అభ్యర్థులు రంగంలో నిలిచారు. పోటీ మాత్రం బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కామారెడ్డిలో ప్రధాని నరేంద్రమోదీ, ఇతర నియోజకవర్గాల్లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేచంద్రశేఖర్‌రావు, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు తమ పార్టీల అభ్యర్థుల తరపున జోరుగా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ తొమ్మిది నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ఒకటి రెండు రోజుల తేడాలోనే ఉమ్మడి జిల్లాలో పలుమార్లు పర్యటించడం విశేషం. ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల అగ్రనేతలు ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులకు మద్దతుగా నాయ కులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం ని ర్వహించారు. ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారోనని అందరూ ఉత్కంఠతతో నిరీక్షిస్తున్నారు.